మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## మాజీ జడ్పీటిసి వెంకట్‌రెడ్డి మృతి

**సంతాపం వ్యక్తం చేసిన మంత్రి హరీష్‌రావు**

**నంగునూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** నంగునూర్ మండల పరిధిలోని బద్దిపడగ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటిసి తడిసిన వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. అయన మృతి పట్ల రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబీకులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిఎం కెసిఅర్‌తో అత్యంత సన్నిహితుడిగా నాకు ఎంతో ఆత్మీయుడని పేరొ ్కన్నారు. వెంకటరెడ్డి మృతి తనను కలిచివేసిందన్నారు. జడ్పీటిసిగా, పార్టీ సీనియర్ నాయకునిగా మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ పదవులు స్వీకరించి నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటు పడ్డాడని తెలిపారు. అయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

## బొంగొండేశ్వర విగ్రహావిష్కరణకు తరలిరావాలి

**రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారుల అధ్యక్షులు మల్‌శెట్టి**

**నాగల్‌గిద్ద, డిసెంబరు 16, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తారీఖున నిర్వహించే బొంగొండేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆయాగ్రామాల్లోని గొల్ల కురుములు పెద్దసంఖ్యలో చేరుకోవాలని రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారుల అధ్యక్షులు బాపు మల్‌శెట్టి అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తాపూర్, వల్లూర్, పూసలపాడు గ్రామాల్లో కురుమ సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్‌ను కురుమ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముక్తాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మల్‌శెట్టి మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో నిర్వహించే మహాత్మా బొంగండేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకోవాలన్నారు. కార్యక్రమాల్లో గొర్రెల పెంపకం దారుల జిల్లా సంఘం ఉపాధ్యక్షులు గోవింద్ యాదవ్, మనూర్ మండల ఉపాధ్యక్షులు గెలెప్ప, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# పనులు పూర్తి చేసినా బిల్లులు రావడం లేదు

## మండల సర్వ సభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన

**వెల్దుర్తి, డిసెంబర్16 ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాల్లో వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, రైతు వేదికలు తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసినప్పటికీ తమకు బిల్లులు రావడం లేదని సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, సర్పంచులు నరేందర్‌రెడ్డి, మల్లేశంలతో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వెల్దుర్తి ఉమ్మడి మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షురాలు స్వరూప నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, ఎంపీడీవో జగదీశ్వరచారి, తహశీల్దార్లు సురేష్‌కుమార్, మాలతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ తాము పూర్తి చేసిన పనులకు అధికారులు త్వరగా బిల్లులు ఇప్పించాలని, లేనియెడల తాము ప్రస్తుతం సర్పంచులు బాధ్యతను తీసుకోవడం ఇబ్బందుల పాలవుతామని అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జగదీశ్వర చారి మాట్లాడుతూ గ్రామాల సర్పంచులకు తాము పై అధికారులు చెప్పిన విధంగా అభివృద్ధి పనుల కోసం చెప్పడం జరుగుతుందని, చాలా వరకు బిల్లులు వస్తున్నాయని, కొన్ని ఇబ్బందుల వల్ల ఆగాయని, త్వరలో వచ్చే విధంగా సంబంధిత అధికారులకు విన్నవిస్తామన్నారు. వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ మండలంలో 918 ఎకరాలలో వరి, 5 ఎకరాలలో మొక్కల జొన్న, 6 ఎకరాలలో జొన్న, 5 ఎకరాలలో వేరు శనగ పంటలను, 5 ఎకరాలలో కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారని ఆమె వివరించారు. ఇప్పటి వరకు పీఎం కిసాన్ ఈ కేవైసీ చేయించుకోని రైతులు 2,500 మంది ఉన్నారని, ఈ రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో డీడీలు కట్టిన ప్రతి రైతుకు స్తంభాలు ఇస్తూ ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తున్నామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని ఎస్టీ తండాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని పీఆర్ఏఈ శ్రీనివాస్ తెలిపారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. దొంతి నుండి పిల్లికొట్టాల్ వరకు రోడ్డుకు త్వరలో నిధుల రావడం జరుగుతుందన్నారు. ఈజీఎస్‌లో పనులు చేసిన కూలీలకు డబ్బులు రావడంలేదని వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ అధికారులను ప్రశ్నించారు. ఈజీఎస్ ఏపీవో రాజు స్పందిస్తూ గత నాలుగు నెలల నుండి కూలీల డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వచ్చే విధంగా అధికారులకు విన్నవిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జెడ్పీ టీసీ రమేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఉప్పులింగాపూర్, వెల్దుర్తి గ్రామాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.




సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇంటి ముందు నిరసన తెలుపుతున్న కుటుంబీకులు

## బెజుగామలో దారుణం

**- డబుల్ బెడ్‌రూం కేటాయించి వెనక్కి తీసుకున్న అధికారులు**
**- ఐదు నెలలుగా ఉన్న ఇంటికి తాళం వేసిన రెవెన్యూ అధికారులు**
**- ఇంటి ముందు కుటుంబీకులు నిరసన**

**గజ్వేల్, డిసెంబర్ 16 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు పడకగదుల ఇళ్ళు లబ్దిదారులకు కేటాయించే విషయంలో గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించకపోవడంతో గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో గత ఐదు నెలల క్రితం మంత్రి హరీష్‌రావు 20 మంది నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళు మంజూరుచేసి లబ్ధిదారులకు అప్పగించారు. అదే గ్రామానికి చెందిన తాటికొండ పోచమ్మకు 20వ నెంబర్ డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించారు. మంత్రి హరీష్‌రావు ప్రారంభోత్సవం చేస్తున్న క్రమంలో సైతం తాటికొండ పోచమ్మ ఆమెకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇంటిలో అందరితో పాటు పూజలు చేసుకొని గృహప్రవేశం చేశారు. స్థానిక సర్పంచ్ సైతం మీకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరైందని చెప్పి వారి ఇంట్లో కాసేపు కూర్చొని వెళ్ళినట్లుగా బాధితురాలు వాపోయారు. ఇదిలా ఉండగా గురువారం గజ్వేల్ ఆర్‌ఐ కృష్ణ గ్రామ విఆర్‌ఏలతో కలిసి తాటికొండ పోచమ్మకు ఇంటికి వెళ్ళి లీస్టులో నీ పేరు లేదని, డబుల్ బెడ్‌రూంకు అర్హులు కాదని ఇల్లు ఖాళీ చేయించాలని చెప్పడంతో వారు వినకపోవడంతో విఆర్‌ఏలు ఇంట్లో సామాగ్రిని బయట వేశారు. దీంతో తాటికొండ పోచమ్మ, కుటుంబసభ్యులు గత రెండు రోజులుగా ఇంటి బయటనే ఉంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి హరీష్‌రావు చేతులమీదుగా సాముహిక గృహ ప్రవేశాలు చేసి డబుల్ బెడ్‌రూం మంజూరైందని చెప్పి మాకు ఇల్లు ఇచ్చినట్టే ఇచ్చి అధికారులు తీసుకోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులమని చిన్నచూపు చూస్తున్నారని మాకు బెజుగామ గ్రామంలో ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని డబుల్ బెడ్‌రూంకు కావాల్సిన అర్హతలు అన్ని ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసితో పాటు మరో ప్రజాప్రతినిధి మాకు డబుల్ బెడ్‌రూం మంజూరు కాకుండా అడ్డు పడుతున్నారని, డబుల్ మంజూరు చేసేంత వరకు తమ పిల్లలతో కలిసి ఇక్కడే ఉంటామని భీష్మించుకుకూర్చున్నారు. అర్థాంతరంగా ఇంట్లో నుండి గెంటివేయడం మంచిదికాదన్నారు. డబుల్ బెడ్‌రూం మంజూరైందన్న సంతోషంతో నల్లాతో పాటు నూతనంగా బాత్రూమ్ ఏర్పాటు చేసుకున్నామని, డబుల్ బెడ్‌రూంకు సుమారు రూ.20వేల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూం లీస్టులో పేరు లేకుంటే ఆరు నెలల నుండి ఎందుకు ఉండనిచ్చారని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి తనను మోసం చేస్తున్నారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ళ కేటాయింపులో ప్రజాప్రతిధులే అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో 20 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారని, అందులో 17 మందికి ఇళ్ళతో పాటు స్థలాలు కూడా ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి తనకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇంటి తాళాలను అందజేయాలని డిమాండ్ చేశారు.

### పోచమ్మకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించలేదు

బెజుగామ గ్రామానికి చెందిన తాటికొండ పోచమ్మకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు కాలేదని, గత ఐదు నెలల నుండి డబుల్ బెడ్‌రూం అక్రమంగా ఉన్నట్లు గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజు పేర్కొన్నారు. బెజుగామ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళు కేటాయించామని అందులో తాటికొండ పోచమ్మ పేరు లేదన్నారు. తను ఉంటున్న 20 నెంబర్ ఇంటిలో తమ అధికారులతో నాలుగైదు సార్లు ఖాళీ చేపించాలని చెప్పినా ఆమె వినకపోవడంతో ఆర్‌ఐని పంపగా అతను సామాగ్రిని పక్కనబెట్టి ఇంటికి తాళం వేసి వేరే లబ్ధిదారునికి అందించినట్లు తెలిపారు. తాటికొండ పోచమ్మకు సైతం ఆమె ఉన్న ఇంటి ఖాళీ స్థలంలో ప్రభుత్వం కేటాయించే రూ.3 లక్షలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

### మల్లన్న కళ్యాణోత్సవానికి

## పటిష్టమైన బందో బస్తు

**అడిషనల్ డీసీపీ మహేందర్**

**కొమురవెల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ అవరణలో ఈనెల 18న నిర్వహించే స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట మైన బందో బస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్ అన్నారు. శుక్రవారం అయన మండల కేంద్రంలో స్వామి వారి కళ్యాణోత్సవం సందర్భంగా సీపీ శ్వేత అదేశాల మేరకు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. బందోబస్తును 4 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. తోట బావి వద్ద కళ్యాణ వేదిక, టెంపుల్ అవరణలో, ట్రాఫిక్, పార్కింగ్ ప్రదేశాలుగా విభజించినట్లు వివరించారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి శాఖకు చెందిన వారి కోసం కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుందన్నారు. కళ్యాణ వేదిక వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 80 సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘా పెట్టడం జరుగుతుందన్నా రు. ఏసీపీలు 3, సీఐలు 8, ఎస్ఐలు 14 మందితో పాటు 280 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపి భక్తులకు, ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే అట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు శ్రీనివాస్, రామకృష్ణ, తిరుపతి, చంద్రమోహన్, ఈవో బాలాజీ, ఏఈఓ అంజయ్య, డైరెక్టర్లు సిద్దిరాములు, తిరుపతి, రఘువీర్, జడ్పీటిసి సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ మహేందర్

# కష్టపడుదాం..జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం

## టిఎన్జీవోల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగులు ఎంతో కష్టపడి సిద్దిపేట జిల్లాను అన్నిరంగాల్లో ముందుంచే ప్రయత్నం చేస్తున్నారని..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే బహుమతుల్లో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు దక్కించుకోవడం సంతోషంగా ఉందని టిఎన్జీవోల జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమాండ్ల విక్రమ్‌రెడ్డిలు అన్నారు. జిల్లా కేం ద్రంలోని టిఎన్జీవో భవన్‌లో శుక్రవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అఫీసర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు బహుమతులు సాధించడంతో మంత్రి తన్నీరు హరీష్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ప్రోత్సహం ఎంతగానో ఉందన్నారు. ఉద్యోగులు మరింత కష్టపడి పని చేస్తే సంఘానికి మంచి పేరు తీసుకరావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిద్దిపేట జిల్లా ఉద్యోగులంటేనే ఎంతో గౌరవం ఉందన్నారు. ఉద్యోగులు మరింత కష్టపడి పని చేస్తూ జిల్లాను అన్నిరంగాల్లో అదర్శంగా నిలుపాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు సంఘంలో సభ్యత్వం తీసుకోని సంఘాన్ని మరింత పటిష్టం చేద్దామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలుగా ఉన్న మూడు డిఎలను విడుదల చేయాలని సిపిఎస్‌ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తీర్మాణాలు చేశారు. ఉద్యోగుల హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగుల మెడికల్ రియంబర్స్‌మెంట్‌ను జిల్లా పరిధిలో రూ.50 వేల నుంచి రెండు లక్షలకు పెంచాలని తీర్మాణం చేశారు. కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు నూతన కలెక్టరేట్ వద్ద ఇండ్ల స్థలాలు కేటాయించాలని పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరగా చెల్లించాలని తీర్మాణాలు చేశారు. గజ్వేల్ టిఎన్జీవో భవనానికి అదనంగా రూ.10 లక్షలు కేటాయించిన మంత్రి తన్నీరు హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిమ్మ సురేందర్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిఎన్జీవోల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



మృతిచెందిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

## అడవి జంతువుల దాడిలో దూడ మృతి

**మర్కుక్, డిసెంబర్ 16 (ప్రభాతవార్త):** అడవి జంతువుల దాడిలో ఆరు నెలల దూడ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని శివారువెంకటాపూర్ గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు శివారువెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల నర్సింగరావు రోజుమాదిరిగానే తన వ్యవసాయ పొలం వద్ద గురువారం ఉదయం మేతకు తీసుకెళ్ళి సాయంత్రం బావి వద్ద ఉన్న పశువుల పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం వెళ్ళి చూసేసరికి దూడ గాయాలతో మృతిచెంది పశువుల పాక వద్ద కనిపించింది. ఇది గమనించిన రైతు పోలీసు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షెకావత్, బీట్ ఆఫీసర్ జ్యోతి, పోలీసు సిబ్బంది చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతిచెందిన దూడకు పశువైద్యాధికారి డాక్టర్ రాకేశ్ పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ అధికారి మాట్లాడుతూ అడవి జంతువుల దాడిలో దూడ మృతిచెందిందని, గ్రామస్తులు అనుమానిస్తున్నట్లు పులి దాడిలో మృతిచెందలేదని ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, వ్యవసాయ బావుల వద్ద పశువులను ఉంచే వారు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## స్వామి వారి కళ్యాణోత్సవానికి పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలి

**జనగామ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి**

**కొమురవెల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం ఈనెల 18న జరగనుండడంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని భక్తులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో మల్లికార్జున స్వామి కళ్యాణోత్సం సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్న పనులను పరిశీలించి మాట్లాడారు. స్వామి అలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులకు నీటి సౌకర్యం, వైద్య సౌకర్యం అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. స్వామి వారి కళ్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారని ఏర్పాట్లలో ఏలాంటి లోపం ఉండొద్దన్నారు. అయన వెంట వివిధశాఖల అధికారులు, ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, అలయ చైర్మన్ గీస బిక్షపతి, జడ్పీటిసి సిద్దప్ప, డైరెక్టర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు

# అధికారులు చర్యలు తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్ అర్బన్, డిసెంబర్16 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవలసిందిగా అదనపు కలెక్టర్ రమేష్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఇంజనీరింగ్, పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంతో పాటు క్షతగాత్రులు మృత్యువాత పడుతుండడం బాధాకరమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలతో పాటు, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు నివారించడంతో పాటు ఆ కుటుంబాలు రోడ్డున పడకుండా నివారించగలిగిన వారము వుతామని అన్నారు. మనోహరాబాద్ నుండి తూప్రాన్, చేగుంట, రామాయంపేట జాతీయ రహదారితో పాటు నర్సాపూర్-మెదక్ రహదారి వెంట గుర్తించి బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని, క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం నిమిత్తం అంబులెన్స్, రహదారుల వెంట బయో వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో రేడియం సైన్ బోర్డులు, సీసీ కెమెరాఉలు ఏర్పాటు చేయాలన్నారు. ఉన్నత స్థాయిలో అనుమతులు, నిధుల మంజూరుకు పంపిని ప్రతిపాదనలు అందజేస్తే తగు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రవాణాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ అండ్ బీ డీఈఈ వెంకటేశం, జాతీయ ప్రాధికార సంస్థ మేనేజర్ తరుణ్ కుమార్, హైవే సీనియర్ ఇంజనీర్ ఏడుకొండలు, కిరణ్ కుమార్, లక్ష్మణ్, జిల్లా ఆబ్కారీ అధికారి రజాక్, సీఐ మధు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# గరం గరంగా సర్వసభ్యసమావేశం

**విద్యుత్ అధికారులపై మూకుమ్మడిగా దాడి చేస్తాం..!?**
**-మండల సమావేశంలో సర్పంచ్‌ల అల్టిమేటం**

**అక్కన్నపేట, డిసెంబర్16, ప్రభాతవార్త :** మడుమాసాలకో మారు నిర్వహించే మండల సర్వసభ్యసమావేశం అక్కన్నపేట మండలంలో గరం గరంగా సాగుతూ అద్యంతం ఉత్కంఠగా నెలకొల్పింది. శుక్రవారం నాడు అక్కన్నపేట మండల సర్వసభ్యసమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు మాలోతు లక్ష్మిభీలూనాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ఆరంభంలోనే ఎజెండా వారిగా వ్యవసాయం, నిత్యావసరాల సరుకుల పంపిణీ, పశుపోషణ, విద్యుత్, వైద్య, విద్య, సమగ్రశిశు అభివృద్ధి, ఐకెపి, ఇంజినీరింగ్, మిషన్‌భగీరథ, రహదారులు భవనాలశాఖ, ఈజీఎస్, ఎక్సైజ్‌శాఖ తదితర అంశలపై సమగ్రంగా చర్చలను చేపట్టారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు సమావేశంలో మాట్లాడుతున్న సమయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు అయిన సర్పంచ్‌లు భగ్గున మండిపడ్డారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తమ గ్రామాలకు చెందిన సమస్యలను ఏకరువు పెట్టినా ఏమాత్రం పట్టించుకోకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గరం అవుతూ అవసరమైతే మండంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు విద్యుత్ అధికారులు సిబ్బందిపై దాడికి దిగుతామని సభాముఖంగా హెచ్చరించారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి కుందనవానిపల్లి గ్రామ సర్పంచ్ అన్నాడి దినేష్‌రెడ్డితో పాటు ఇతర గ్రామాల సర్పంచ్‌లు సైతం గ్రామాల్లోని మిడిల్‌పోల్, లూజ్‌లైన్, వ్యవసాయ బావుల దగ్గర అలాగే పల్లెప్రగతిలో వేసిన విద్యుత్ స్థంభాలకు ఇంతవరకు వైరు బిగించకుండా వదిలివేసిన విషయంపై సర్పంచ్‌లు తీవ్రంగా మండిపడ్డారు. విద్యుత్ సరఫరాలో సైతం విద్యుత్‌శాఖ తమ ఇష్టంగా వ్యవహరిస్తున్నదని దీంతో అధిక వోల్టేజివల్ల వ్యవసాయబావుల వద్ద మోటార్లు కాలిపోతున్నాయని మోత్కులపల్లి గ్రామ సర్పంచ్ గొర్ల కుమారస్వామి ఆవేదన చెందారు. దీంతో రైతన్నలు తీవ్ర నష్టాలకు గురి కావలసి వస్తోందన్నారు. డంపింగ్‌షెడ్లకు సంబందించిన డిడిలు ఇచ్చినా ఇంతవరకు కనెక్షన్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నిత్యావసరాలకు సంబందించి నూతన గ్రామ పంచాయితీలకు సంబందించి బియ్యం సరఫరా విషయంలో మండలంలోనే ఇవ్వడం మూలానా ఆయా సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి సవస్తుందని చెబుతూ తమ గ్రామాలకు చెందిన పంచాయితీ ట్రాక్టర్లను పంపి బియ్యం దిగుమతి చేస్తున్నా తహసీల్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా డీలర్లకు ఆదేశాలు ఇవ్వకపోవడం మూలానా తమ గ్రామాలకు డీలర్లు వచ్చి బియ్యం ఇవ్వడం లేదని కపూర్‌నాయక్ తండ గ్రామ సర్పంచ్ బానోతు సంతోష్‌నాయక్, కేశ్‌నాయక్‌తండ సర్పంచ్ బానోతు రవిందర్‌నాయక్‌లు మండిపడ్డారు. గత నాలుగు ఏళ్ళుగా సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నా ఇంతవరకు కంటికి కానరాకుండా అబ్కారీ అధికారులు ఉంటున్నారని సమావేశంలో సిఐ హాజరు కాకుండా కేవలం కానిస్టేబుల్ స్థాయి వారినే పంపించడం ప్రజాప్రతినిధులను కించపరచడానికేనా అని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బొమ్మగాని రాజేశం, చౌటపల్లి గ్రామ సర్పంచ్ గద్దల రమేష్ ప్రశ్నించారు. ఈ సమావేశానికి అక్కన్నపేట ఎంపిపి మాలోతు లక్ష్మిభీలూనాయక్, జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగ శ్రీనివాస్, ఎంపిడివో సత్యపాల్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏఇవో భోగేశ్వర్‌తో సహా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు,




సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మిభీలూనాయక్



విద్యుత్ అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## విజయ్‌కుమార్‌ను విమర్శిస్తే ఉరుకోం

**కొండపాక, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండపాక విజయ్ కుమార్‌ను విమర్శిస్తే సహించేదిలేదని మండల పార్టీ నాయకుటు బుద్ధి రమేష్, మంద కొమురయ్య, పర్శరాములు, సుదర్శన్ హెచ్చరించారు. శుక్రవారం రవీంద్రనగర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కొండపాక విజయ్‌కుమార్‌పై అనుచితవ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్య కర్తలకు అందుబాటులో ఉంటు ఆపదాలో అదుకునే నాయకుడు విజయ్ కుమార్ అన్నారు. పార్టీ పిలుపు నిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ స్థానిక సమస్యల మీద అధికార పార్టీపై గళమెత్తె నాయకునిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైంది కాదన్నారు. మూడు రోజుల క్రితం మాజీ ఉపముఖ్యమంత్రి దామోరరాజనర్సింహ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో కోవర్టులకు పదవులు ఇచ్చారని అరోపించారేకాని అయన ఎవరి పేరు ప్రస్తవించలేదని గుర్తుచేశారు. అనివార్యంగా నర్సారెడ్డి అనుచరులే అయన పేరును తెరమీదికి తెచ్చార న్నారు. ఇప్పటికైనా ఎవరిని విమర్శించకుండా ఉండాలని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వడ్ల కొండ రవీందర్, రమేష్, కుంచం రవి, ఐలయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటిసి వెంకటరెడ్డి మృతికి మంత్రి సంతాపం

**నంగునూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** మండలపరిధిలోని బద్దిపడగ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటిసి తడిసిన వెంకట్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతిపట్ల రాష్ట్ర అర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబికులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌తో అత్యంత సన్నిహితుడిగా నాకు ఎంతో ఆత్మీయుడని పేర్కొన్నారు. వెంకటరెడ్డి మృతి తనను కలిచివేసిందన్నారు. జడ్పీటిసిగా, పార్టీ సీనియర్ నాయకునిగా మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ పదవులు స్వీకరించి నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటు పడ్డాడని తెలిపారు. అయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

## పేద వధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**తొగుట, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకట్రావ్ పేట గ్రామానికి చెందిన నిరుపేద అఖిల వివాహానిమిత్తం శుక్రవారం ఎంఎన్అర్ ట్రస్టు వ్యవస్థాపకులు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మద్దుల నాగేశ్వర్‌రెడ్డి అదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధులు పోతరాజు రవీందర్, చందా రాజు పుస్తెమట్టెలు అందజేశారు. ట్రస్టు అధ్వర్యంలో భవిష్యత్‌లో పేదలను అదుకోవడానికి మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామన్నారు. సేవ కార్యక్రమాలతోనే జీవితంలో నిజమైనాతృప్తి లభిస్తుందన్నారు, కార్యక్రమం లో ట్రస్టు సభ్యులు, గ్రామ ఉప సర్పంచ్ గణేష్‌గౌడ్, కన్నెష్, రమేష్‌గౌడ్, స్వామిగౌడ్ తదితరులు ఉన్నారు.

## పేదవారికి చేయూత అందించడమే ఉప్పల ఫౌండేషన్ లక్ష్యం

**ములుగు, డిసెంబర్ 16 (ప్రభాతవార్త):** పేదవారికి చేయూత అందించ డమే ఉప్పల ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐవిఎఫ్ అల్వాల్ ఫౌండర్ ప్రెసిడెంట్ బచ్చు చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ములుగు మండల పరిధి లక్ష్మక్కపల్లి విపిజె ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సంధి శ్రీనివాస్‌రెడ్డి కూతురు విజయ వివాహానికి ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, టిఎస్ టిడిసి చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త సౌజన్యంతో ఐవిఎఫ్ అల్వాల్ మండల ఫౌండర్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన పుస్తెలు, మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పాలకుర్తి నరేష్‌కుమార్, కోశాధికారి బిక్కినెల్లి నర్సింలుగుప్త, మహిళా అధ్యక్షురాలు పాలకుర్తి రజిని పాల్గొన్నారు.

## చిన్నారులకు కుర్చీలు అందజేత

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 16 (ప్రభాతవార్త):** సమాజ సేవయే లక్ష్యమని జగదేవ్‌పూర్ మండల లయన్స్‌క్లబ్ ఆఫ్ మిత్ర అధ్యక్షుడు బుద్ద నాగ రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అలిరాజపేట, నిర్మల్‌నగర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు లయన్స్‌క్లబ్ సభ్యులు రవీందర్‌చారి దంపతుల పెళ్ళి రోజు సందర్భంగా కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామాల్లో సామా జిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, స్థానిక సర్పంచ్ లక్ష్మిచంద్రశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు అమర రామ్‌నివాస్, శేఖర్, రాము, శివకుమార్, వేణు, కొండల్, శివుడు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొండపాక, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల పోషవ్వ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ గ్రేటర్‌హైదారబాద్ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ స్థానిక నాయకులచే రూ॥ 5 వేల అర్థిక సహాయన్ని మృతురాలి కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్ లో మాట్లాడుతూ పేద కుటుంబాలను అదుకోవడంలోనే నిజమైన సంతోషం లభిస్తుందన్నారు.

## జనవరి 5 నుంచి చౌడుతండాలో క్రికెట్ టోర్నమెంట్

**అక్కన్నపేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** మండలంలోని చౌడుతండ గ్రామంలో శ్రీసంత్‌సేవాలాల్‌జయంతి పురస్కరించుకుని ఆల్ ఇండియా బంజారాసేవాసంఘం ఆధ్వర్యంలో జనవరి 5నుండి ఫిబ్రవరి 15వరకు క్రికెట్ మెగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ధరావత్ తిరుపతినాయక్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో క్రికెట్ ఆట స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు బహుమతులు అందించడం జరుగుతుందని జిల్లాలోని గిరిజన యువకులు అత్యదిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

**కొండపాక, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** 51వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్ సీనియర్ మెన్ పోటీలు ఈ నెల 17 నుండి 19 వరకు తిమ్మారెడ్డిపల్లి వినాయక ఎంబిఎ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు ఉపేందర్, కార్యదర్శి దామర మల్లేశం, విజయ్ బాబు, సర్పంచ్ మల్లమారి రవీందర్ తెలిపారు.

### రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు సత్కారం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** కబడ్డీ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన ఇద్దరు యువకులను కొర్రెముల గ్రామ సర్పంచ్ ఒరుగంటి వెంకటేశ్‌గౌడ్ శుక్రవారం శాలువా కప్పి సత్కరించారు. క్రీడాకారులకు ఇరువురికి ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున ప్రోత్సహక నగదు అందజేసినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెములకు చెందిన ఉదయ్, విశాల్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. దీంతో సర్పంచ్ ఇరువురు యువకులను అభినందించారు. గ్రామానికి చెందిన యువకులు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక కావ డం సంతోషంగా ఉందని అన్నారు.

### ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌కు కేజీబీవీ విద్యార్థుల ఎంపిక

**బొంరాస్‌పేట, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** డిసెంబర్ 18వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహిస్తున్న క్యాప్టన్ కప్ సౌత్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కేజీబీవీ చెట్టుపల్లి తండా విద్యార్థులు ఎంపికయ్యారు. సెలెక్ట్ అయిన విద్యార్థులకు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, టీఆర్ఎస్ నేత చాన్‌పాషా అభినందించారు. టోర్నమెంట్‌కు వెళ్తున్న ప్రతి విద్యార్థి పథకాలు సాధించాలని సూచించారు. విద్యార్థినిలు అందరూ మహిళ జాతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ఆత్మరక్షణగా కరాటే నేర్చుకోవాలని అన్నారు. టోర్నమెంట్ కు వెళ్తున్న విద్యార్థినిలకు రవాణా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# కొడంగల్ నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ

## -ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కృషితో నిధుల మంజూరు



రోడ్లకు నిధుల మంజూరీపై ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్

**కొడంగల్, డిసెంబర్ 16ప్రభాతవార్త**

కొడంగల్ నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ రానుందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీటీ, సీసీ రోడ్ల అభివృద్ధికి గాను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు మండల పరిధిలోని పోచమ్మతాండ నుంచి మైసమ్మ తాండా వరకు రూ.1.50 కోట్ల నిధులతో బీటీ రోడ్డు మంజూరీ కావడం హర్షణీయమన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని అనేక తండాలకు, గ్రామాలకు కొత్తరూపు సంతరించుకోనుందన్నారు. గతంలో అభివృద్ధికి నోటుకోని ఎన్నో గ్రామాలు, తండాలకు మహర్దశ రానుందన్నారు. రూ.32.43కోట్లతో 52.7 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదలైనట్లు తెలిపారు. దారి లేని ఎన్నో గ్రామాలకు నేడు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నాయకత్వంలో నూతన రోడ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. గత పాలకులు కేవలం మాటలతో పబ్బం గడుపుకున్నారు తప్ప తండాల గురించి పట్టించుకోలేదన్నారు. పోచమ్మ తండా రోడ్డుకు నిధుల మంజూరీ కావడంపై తండావాసుల తరపున ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# భూ దాతకు అండగా మేముంటాం

**-నందినినగర్ కాలనీ వాసులు**
**-సర్పంచ్,పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేత**
**-వార్డు సభ్యుని ఫిర్యాదును పరిగణలోకి తీసుకోవద్దు**

**కీసర, డిసెంబరు16, ప్రభాతవార్తః**

మండల కేంద్రమైన కీసర గ్రామంలోని నందినినగర్ కాలనీకి చెందిన ఆనబోయిన మహేందర్ అతని కుటుంబ సభ్యులు కలిసి నందినినగర్ కాలనీ నుండి భూగర్భ మురికి కాలువ నీరు పోవడానికి అవుట్‌లెట్‌కి సంబందించి నాలుగు వందల గజాల స్థలాన్ని గ్రామ పంచాయతీకి విరాళం ఇవ్వగా అతనిపై వార్డు సభ్యులు రామారం ప్రదీప్‌కుమార్ గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేయడం ఏమిటని నందినినగర్ అసోసియెషన్ సభ్యులు శుక్రవారం సర్పంచ్ నాయకపు మాధురి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందినినగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ సుమారు 60 లక్షల విలువ గల భూమిని భూగర్భ మురికి కాలువ నీరు పోవడానికి అవుట్‌లెట్ విరాళంగా ఇవ్వగా గ్రామ పంచాయతీ పాలకవర్గం అతనికి సహకారం ఇస్తామని గతంలో చెప్పడం జరిగిందని తెలిపారు. ఆనబోయిన మహేందర్ తన స్థలంలో చిన్న షెడ్డు నిర్మాణం చేస్తుంటే వార్డు సభ్యుని ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో పంచాయతీ పాలకవర్గం అతనికి అండగా ఉండాలన్నారు. గ్రామాభివృద్ధికి భూమి ఇచ్చిన భూ దాతపై రామారం ప్రదీప్‌కుమార్ కక్ష పెట్టుకుని ఇలా చేస్తున్నారని అన్నారు. భూ దాతకు నందనినగర్ కాలనీవాసులం అందరం అండగా ఉంటామని తెలిపారు. వార్డు సభ్యులు రామారం ప్రదీప్‌కుమార్ ఆగడాలను సాగనివ్వమని హెచ్చరించారు. ఇప్పటికైనా ఆనబోయిన మహేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నందినినగర్ కాలనీ అధ్యక్షులు ముస్తఫా అలీ, ఉపాధ్యక్షులు చిన్నంశెట్టి శ్రీ రాములు, ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్ ముదిరాజు, సంయుక్త కార్యదర్శులు మంచాల నర్సింహ్మ, మాధప్ప, కోశాధికారి వల్లపు కనకయ్య, అయ్యప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొత్తపేట పరమేశ్వర్, జాగిల్లపురం బాలరాజు, సలహాదారులు ఆలకుంట కర్ణ, రాజు, గౌరవ అధ్యక్షులు ఆముదాల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



నందనినగర్ భూ దాతకు అండగా మేముంటామని సర్పంచ్ మాధురికి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

# దేశీయ సాంప్రదాయ వంటకాలే ఎంతో శ్రేష్టం



విద్యార్థులు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న పాఠశాల యాజమాన్యం

**షాద్‌నగర్, డిసెంబర్ 16, (ప్రభాతవార్త) :**

ఆధునిక యుగంలో మానవుల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయని, తద్వార ఎన్నో సమస్యలను కొనితెచ్చుకుంటున్నారన్న ఆలోచనతో స్థానిక కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో దేశీయ సాంప్రదాయ వంటకాలపై శుక్రవారం ఓ వినుత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పలు రకాల వంటకాలు తయారు చేసి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారు తయారు చేసిన వంటకాలతో పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం రఫత్ బేగం మాట్లాడుతూ... మారుతున్న ఆహారపు అలవాట్లతో మానవాళి పూర్తిగా అనారోగ్యం బారిన పడుతున్నారని, ముఖ్యంగా ఈ రకం ఆహారపు అలవాట్ల వల్ల జీవన విధానంలో ఎన్నో రకాల నష్టాలను చూడాల్సి వస్తుందని ఆమె విద్యార్థులకు సూచించారు. బయటి తినుబండరాలు తినడం వల్ల అజీర్తి వంటి సమస్యలు తలెత్తి జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆమె అన్నారు. అందుకే అందరికి అర్థమయ్యేలా దేశీయ సాంప్రదాయ వంటకాలే మంచిదనే ఆలోచనతో ఈ వినూత్న వంటకాల కార్యక్రమాన్ని చేపట్టామని, దీనికి విద్యార్థుల్లో మంచి స్పందన వచ్చిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. సంప్రదాయ వంటకాలు అమృతం లాంటివని, అవి ఔషదంలా మన శరీరాన్ని కాపాడుతాయని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, మేనేజింగ్ డైరెక్టర్ మా సత్తార్, జోనల్ ఇంచార్జీ మా వహీద్, ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

## -ట్రాఫిక్ పోలీసులు, నాయకులు




శామీర్‌పేట పిఎస్ కానిస్టేబుల్ షరీఫ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో బాధిత కుటుంబానికి అందజేయటానికి సిఐ సుధీర్‌కుమార్‌కు అందజేస్తున్న మండల నాయకులు బి.నర్సింలుయాదవ్, సంజీవ్‌యాదవ్ లు 10వేల రూపాయల చొప్పున ఇరువురు అందజేసిన దృశ్యం




శామీర్‌పేట పిఎస్ కానిస్టేబుల్ బాధిత కుటుంబాన్ని ఆదుకోవటానికి అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు వారికి అందజేయటానికి 50వేల రూపాయలు శామీర్‌పేట సిఐ సుధీర్‌కుమార్‌కు అందజేసిన దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 16, ప్రభాతవార్త**

శామీర్‌పేట పోలీస్ కానిస్టేబుల్ షరీఫ్ ఇటీవల విధి నిర్వాహణలో ఉండి రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో బాధిత కుటుంబాన్ని పలువురు ముందుకు వచ్చి ఆర్థికంగ ఆదుకుంటున్నారు. శుక్రవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబానికి మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.నర్సింలుయాదవ్ 10వేల రూపాయలు, ఉద్దెమర్రి యాదవసంఘం అధ్యక్షులు ఎం.సంజీవయాదవ్ 10వేల రూపాయలు శామీర్‌పేట సిఐ సుధీర్‌కుమార్‌ను కలిసి అందజేశారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ,సిఐ రాజు, ఎస్ఐ శ్రీనివాస్. సిబ్బంది శామీర్‌పేట పిఎస్‌కు విచ్చేసిన ట్రాఫిక్ పోలీసులు 50వేల రూపాయలు జమ చేసి బాధిత కానిస్టేబుల్ కుటుంబానికి అందజేయటానికి శామీర్‌పేట సిఐ సుధీర్‌కుమార్‌కు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవటానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ముందుకు వస్తున్నారు.

# అన్నదానం చేయడం ఓ గొప్ప వరం

## - కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్

**షాద్‌నగర్, డిసెంబర్ 16, (ప్రభాతవార్త) :** ఎంతో భక్తిశ్రద్దలతో నియమ నిబంధనలతో నిత్యం స్వామి వారి నామస్మరణతో మాలధారణ ధరించిన అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం ఓ గొప్ప వరంలాటిదని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఎంపీపీ రవీందర్‌యాదవ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని, అప్పుడే మానవ జీవనవిధానం సవ్యమైన దిశలో పయాణిస్తుందని అన్నారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడానికి వచ్చిన అవకాశం ఒక గొప్ప వరంలా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను, ఎంపీపీ రవీందర్‌యాదవ్‌లను అన్నదాత సుఖీభవ అంటూ దీవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అయ్యప్పస్వామి భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### వీరమోని జనార్దన్‌ను పరామర్శించిన వీర్లపల్లి శంకర్

**కొత్తూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** కొత్తూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన రిపోర్టర్ వీరమోని జనార్దన్‌ను శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. పాత్రికేయుడు జనార్దన్ తండ్రి అంజయ్య మృతి చెందారన్న సమాచారం తెలుసుకున్న ఆయన కొత్తూర్‌కు వచ్చి అంజయ్య భౌతికకాయంపై పూలు వేసి నివాళులర్పించారు. అంజయ్య మృతి పట్ల శంకర్ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీర్లపల్లి వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 16,(ప్రభాతవార్త):**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ హాల్‌టికెట్లను ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహాన కమిటీ అధ్యక్షుడు బాల్‌రాజు, ఉపాధ్యాయులు సత్యం, శ్రీనివాస్, శంకర్, బాలు, నగేష్, వెంకట్‌రావు, రమణరావు, పద్మజ, అవేలు మంగ, బాగ్యజ్యోతి, సుమ తదితరులు ఉన్నారు.

### నందివనపర్తి ప్రాథమిక పాఠశాలకు గ్రీన్ బోర్డుల బహూకరణ

**యాచారం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నంది వనపర్తి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన పంబాల రాములు, యాదయ్యలు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శుక్రవారం గ్రీన్ బోర్డును బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అభ్యసన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 12 వేలు విలువైన రెండు గ్రీన్ బోర్డులను పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయులు సాధన, సహదేవ్, శ్రీనివాస్, గ్రామస్తులు పంబాల ఆంజనేయులు, గణేష్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు గ్రీన్ బోర్డులను బహుకరిస్తున్న దృశ్యం

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు,**
**పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి**



ఆర్ఐకి మెమోరాండమ్ సయర్పిస్తున్న కాంగ్రెస్, బిజేపి నాయకులు

**కుల్కచర్ల డిసెంబర్ 16,ప్రభాతవార్త;**

సుజాత మరణానికి కారణమైన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను వెంటనే అరెస్టు చేసి విధుల నుండి బహిష్కరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గసబ్యుడు కరణం ప్రహ్లద్‌రావు, పిఎసిఎస్ మాజి ఉపాద్యక్షుడు బొలుసని భీంరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాతయంతో ఆర్ఐకి మెమోరాండమ్ సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల్కచర్ల గురుకుల పాఠశాలలో తాత్కాలిక స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న మండవెల్కిచర్ల గ్రామానికి చెందిన సుజాతను సరియైన కారణాలు తెలుపకుండా కక్ష్య పూరితంగా ఉద్యోగం నుండి తొలగించడంతో మనస్తాపానికి లోనై పెట్రోల్‌తో నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మరణానికి కారణమైన ప్రిన్సిపాల్‌ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. సుజాత మరణంతో జీవనోపాది కరువైన ఆమె కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు తక్షణ సహయం కింద 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా ప్రదాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య గౌడ్, సీనియర్ నాయకులు కాటన్‌పల్లి అంజిలయ్య, కాంగ్రెస్ పార్టి మండల అద్యక్షుడు బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్, బిజేపి మండల అద్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్, మాజి ఎంపిపి ఆంజనేయులు గౌడ్, మాజి సర్పంచ్ జానకురామ్, కుల్కచర్ల వార్డు మెంబర్ మోతుక్కూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**-పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా**
**-ఎంపిపి టి.అనురాధరమేష్**



విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న యంపిపి

**పెద్దేముల్, డిసెంబరు 16, ప్రభాతవార్త:**

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని యంపిపి టి,అనురాధరమేష్ అన్నారు. పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయము తెలిసిందే. శుక్రవారం యంపిపి టి.అనురాధరమేష్, మండల టిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రావన్‌తో కలిసి ఆమే పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి గల కారణలేమిటని విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యంపిపి అనురాధ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన విషయంతో నిర్లక్షం తగదని ఉపాధ్యాయులకు, (సిసిహెచ్) నిర్వహకులకు సూచించారు. మళ్ళి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని అన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినీయోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలలోని మౌళిక వసతుల కల్పనకు తనవంతు కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మెన్ మర్పల్లి శ్రీనివాస్, హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు మాధురి, గోపాల్‌రెడ్డి, శేఖర్, ఆనంద్, గ్రామస్థులు తెరువటి క్రిష్ణ, యాసని బాలప్ప, తాండ్ర యేసు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల విధుల బహిష్కరణతో నిరసన



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్ఏలు

**కొడంగల్, డిసెంబర్ 16ప్రభాతవార్త**

వీఆర్ఏ జేఏసీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు కొడంగల్ మండలంలో శుక్రవారం వీఆర్ఏలు విధుల బహిష్కరణతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లా కోకన్వీనర్ టి.గోపాల్ మాట్లాడుతు ఇటీవల కామారెడ్డి జిల్లా కామారెడ్డి మండలంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గర నైట్ డ్యూటీ చేసుకొని తిరగి వస్తున్న తరుణంలో వీఆర్ఏ వంగి రవీందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగిందన్నారు. ఇందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 23వేల మంది వీఆర్ఏలు రవీందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి గటిస్తు విధులను బహిష్కరించడం జరిగిందన్నారు. మరణించిన వీఆర్ఏ రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

## తిరుపతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

**కొడంగల్ రూరల్, డిసెంబర్ 16 (పభాతవార్త)ః**

అవాస్తవాలతో అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశ్యనాయక్, తార్యానాయక్, శంకర్‌నాయక్, రాజునాయక్ తదితరులు అన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ ఇష్టానుసారంగా కాంగ్రెస్ నాయకులు, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి పట్ల మాట్లాడటం తగదన్నారు. ఈ నెల 13న కొడంగల్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన గిరిజన మహిళ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరిన విషయాన్ని తెలుసుకున్న తిరుపతిరెడ్డి ఆమెను పరామర్శించి ఆర్థిక సహాయం చేస్తే గిరిజనులను అవమానించారని చెప్పడం సరైంది కాదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని పదే, పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి ఎక్కడ చేశారో చూయించాని ప్రశ్నిస్తే అవాస్తవాలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సరైన మందులు, వైద్యులు లేకపోవడంతో తాండూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. అవాక్కులు, చవాక్కులు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

## డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన పంచాయతీరాజ్ ఈఈ

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్16 ప్రభాతవార్త:** పేదలకు ప్రభుత్వం నిర్మించి ఇస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నాణ్యతలో ఎలాంటి రాజీ లేదని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం సాయంత్రం మెదక్ పట్టణ శివారులోని పిల్లికొట్టాల వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చే ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మించడం జరుగుతుందన్నారు. జర్నలిస్టు కాలనీలో సైతం ప్రతి ఇల్లును క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేపకట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన డీఈ పాండురంగారెడ్డి, ఏఈ సల్మాన్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

## సిఎం కెసిఆర్‌ను కలిసిన ఎంపిపి హరికృష్ణ



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ

**శివ్వంపేట, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ నగరంలో జరిగిన భారత రాష్ట్ర సమితి(భారాస) కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా నుండి జిల్లా ఎంపీపీల ఫోరం తరపున శివ్వంపేట మండల పరిషత్ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణకు ఆహ్వానం అందిన నేపథ్యంలో హరికృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి అపాయిట్‌మెంట్ కోరిన వెంటనే కేసీఆర్ నుండి కల్లూరి హరికృష్ణకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లాలో జరుగుతున్న కాళేశ్వరం పనుల పనులు ఏ స్థాయిలో ఉన్నాయంటూ ఎంపీపీ హరికృష్ణను ముఖ్యమంత్రితో ఇద్దరి మధ్య జరిగిన మాటామంతీ కార్యక్రమంలో అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన కల్లూరి హరికృష్ణను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. మెదక్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు, అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. యువ నాయకులు హరికృష్ణ రాజకీయతో పాటు జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధుల్లో చక్కని వాక్చాతుర్యం గల వ్యక్తిగా పేరు సంపాదించుకున్న కల్లూరి హరికృష్ణను కేసీఆర్ పిలిపించుకొని ఆయనతో మాటామంతీ చేయడంపై ఒక ప్రత్యేకత సంతరించుకుందనే చెప్పవచ్చు.

## మున్నూరు కాపు సంఘం జిల్లాకు కన్వీనర్ల నియామకం



కల్లూరి హన్మంతరావు, బోనగిరి చంద్రశేఖర్

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్16 ప్రభాతవార్త:** మున్నూరు కాపు సంఘం మెదక్ జిల్లాకు నూతనంగా కన్వీనర్లను రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నియమించారు. జిల్లా కేంద్రంలోని పిట్లంబేస్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నూరుకాపు సంఘం మెదక్‌జిల్లా కన్వీనర్‌గా కల్లూరి హన్మంతరావు, యువక మండలి జిల్లా కన్వీనర్‌గా బోనగిరి చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టి జగపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేమె యాదగిరి ఘనంగా సన్మానించారు.

## ముదిరాజ్‌లు ఐక్యతగా ఉండి హక్కులను సాధించుకోవాలి

### సంఘం తాలూకా ఇన్‌చార్జి మన్నె దిగంబర్‌రావు



ముదిరాజ్ సంఘం నాయకులతో దిగంబర్‌రావు తదితరులు

**నర్సాపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** ముదిరాజ్ కులస్తులు ఐక్యతగా ఉండి హక్కులను సాధించుకోవడానికి కృషిచేయాలని సంఘం తాలూకా ఇన్‌చార్జి మన్నె దిగంబర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం గూడెంగడ్డ గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మన్నె దిగంబర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముదిరాజ్ సంఘం ఐక్యత, తాజా రాజకీయ పరిస్థితులు. మత్స్యశాఖ ఫెడరేషన్ గురించి తెలియజేశారు. అంతేగాక కుల దైవమైనటువంటి పెద్దమ్మ ఆలయ నిర్మాణ తదితర విషయాల గురించి చర్చించడం జరిగింది. ముదిరాజ్ కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం దిగంబర్‌రావును సర్పంచ్ జన్ముల నర్సింలుముదిరాజ్, సంఘం నాయకులు శాలూవాతో సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రమేశ్, సాయిలు, మహేశ్, ఆకుల రాజు, సాయినాథ్, శేఖర్, నవీన్, రవిందర్, నర్సింలు, శ్రీశైలం, దుర్గయ్య, లింగయ్య తదితర ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

## మినీ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

**నర్సాపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జూనియర్ కళాశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మాణానికి శుక్రవారం జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్, ఏఇతో కలిసి కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మైదానంలో పర్యటించారు. నర్సాపూర్‌లో మినీ స్టేడియం నిర్మాణం గురించి వారు చర్చించడం జరిగింది. ఈమేరకు ఈ స్థలంలో మినీ స్టేడియం నిర్మాణం కు అనువుగా ఉన్నందు వెంటనే నిర్మాణం చేపట్టవల్సిన అవసం ఉంది. ఈ మేరకు ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ఈ స్థలాన్ని నిర్ణయించగానే మినీ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంబిస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు మున్సిఫల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ తదితరులు

# భూ సమస్యలను పరిష్కరించాలని : ఎమ్మెల్యే

**మెదక్ అర్బన్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి వివిధ మండలాల నుండి ప్రజలు తరలి వచ్చి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి సమస్యలను విన్నవించుకున్నారు. ప్రజా సమస్యలను ఓపిగ్గా విన్న ఎమ్మెల్యే అక్కడ ఉన్న అధికారులకు వివరించి పరిష్కరించాలని సూచించారు. ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలు, ఇతర సమస్యలను ఎమ్మెల్యేకు 110 మంది లిఖిత పూర్వకంగా తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు బ్యాటరీవెహికల్స్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె పార్ట్–బిలో ఉన్న భూ సమస్యలను పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. మీ కోసం కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతుం డటంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుం దన్నారు.





ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

**కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ...**

క్యాంపుకార్యాలయంలో మెదక్ పట్టణం, మెదక్, హవేళీఘనపూర్ మండలాలకు సంబంధించిన 47 మంది లబ్ధిదారులకు రూ.47,05,452 విలువ గల కళ్యాణలక్ష్మీచెక్కులను ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం.లావణ్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షులు కిష్టయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్‌కె.శ్రీనివాస్, కోఆప్షన్ షభ్యులు సయ్యద్ ఉమర్, పాలిన్ రత్నకిరణ్, మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, తహశీల్దార్లు శ్రీనివాస్, నవీన్‌కుమార్, హవేళీఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణాగౌడ్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్‌గౌడ్, బొద్దుల కృష్ణ, సాధిక్ అలీ, వెంకటేశం, ఆంజనేయులు, యాదగిరి, సాంబశివరావు, సర్పంచులు చెన్నా గౌడ్, యామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ కానుకలు పంపిణీ...**

**మెదక్ అర్బన్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ప్రతి పేదవాడు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లు అందజేస్తుందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వైస్రాయ్ గార్డెన్స్‌లో మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కేక్‌ను కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచమంతా శాంతియుతంగా, ప్రేమ పూర్వకంగా ఉండాలని, ప్రేమను అందరికి పంచాలని, త్యాగం, ప్రేమ గొప్పతనాన్ని మనకు తెలిపిన త్యాగశీలి, దయామయుడు ఏసు ప్రభువని అన్నారు. ఈ సందర్భంగా వేయి మందికి క్రిస్మస్ కానుకలు అందజేశారు. క్రైస్తవుల విజ్ఞప్తి మేరకు శ్మశానవాటికకు స్థలం, కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, ఆర్డీవో సాయిరాం, జిల్లా మైనారిటీ అధికారి జెంలా నాయక్, మున్సిపల్ కమీషనర్ జానకిరామ్ సాగర్, మెదక్ నియోజకవర్గ క్రిస్టియన్ సెలెబ్రేషన్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు రెవరెండ్ సంజీవరావు, అశోక్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



మడత గ్రామంలో గుంతలు పూడుస్తున్న జనసేన యువకులు

## మడద గ్రామంలో గుంతలు పూడ్చిన 'జనసైనికులు'

**హుస్నాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త :** మండలంలోని మడద గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద రహదారిలో పెద్ద గుంత ఏర్పడి చాలా రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకోవడంతో జనసేనకు సంబంధించిన యువ నాయకులు సిమెంట్‌తో పూడ్చి గుంతను పూడ్చివేసారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి తగరపు శ్రీనివాస్, పొడిశెట్టి విజయ్, మొలుగూరి అరవింద్, బత్తుల జగదీష్, సంతోష్ పాల్గొన్నారు.

## రుతు ప్రేమపై అవగాహన సదస్సు





మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టరేట్ సముదాయ కార్యాలయంలో శుక్రవారం రుతుప్రేమ కార్యక్రమంపై కార్యాలయ సిబ్బంది, జిల్లా సమాఖ్య సిబ్బంది, మెప్మా, ఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెంగళూర్‌నుంచి గైనకాలజిస్ట్ డాక్టర్ శాంతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుతుప్రేమలో భాగంగా రుతుచక్ర సమయంలో మహిళలు తీసుకోవాల్సిన మెడికల్ గ్రేడ్ సిలికప్‌ని వాడే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ మాట్లాడుతూ రుతుప్రేమలో గ్లోబల్ ప్రచారం తీర్చిదిద్దేలా జిల్లాను నిలపడంలో మంత్రి హరీష్‌రావు కృషి వెలకట్టలేనిదన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, సీపీ ఎన్.శ్వేత తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్డీఏ పిడి గోపాల్‌రావు, డిబీసీఓ సరోజ, డిపిఓ దేవకిదేవి, సెట్విన్ మేనేజర్ అమీనాబేగం, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు స్వాతి తదితరులు పాల్గొనా న్నరు.

## నేడు కొమురవెల్లికి రానున్న స్వామిజీ

**కొమురవెల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం ఈనెల 18న నిర్వహిస్తుండడంతో వేద పర్యవేక్షణ కోసం ఈనెల 17న శ్రీరాష్ట్రీయ నిగమాగమ నీరజభాస్కర్ గురుసిద్ధ మణికంఠ శివాచార్య మహాస్వామి షోలాపూర్ శ్రీమత్కా శీజ్ఞాన సింహాసన మహా పీఠశాఖ శ్రీ కమళస్వామి బృహన్మఠాధీశులు కొమురవెల్లికి విచ్చేయనున్నారు.

## కాలబైరవ స్వామి దీవెనలు ప్రజలపై ఉంటాయి : ఎమ్మెల్యే

**తొగుట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గుడికందుల గ్రామంలో శ్రీ కాలబైరవ స్వామి జయంతి మహోత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేద పండితుల అశీర్వచనాలు తీసుకున్నారు. కాలబైరవ స్వామి దీవెనలు ఎప్పటికి దుబ్బాక నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రాజిరెడ్డి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అయన వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చిక్కుడు చంద్రం, విభీషన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తోలుకంటి రాజు, అంజనేయులు, కొమ్ము కరుణాకర్, మహేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి ఉన్నారు.

## శతాధిక వృద్ధురాలు బాలవ్వ మృతి

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** నేటీ ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి సగటు జీవితం 70 ఏళ్లకు చేరుకుంది. ఈ తరుణంలో బలమైన పోషక విలువలుగల ఆహారాన్ని తీసుకుంటే మనిషి 100 ఏళ్లు జీవించవచ్చని బాలవ్వ నిరూపించింది. అమె జీవితకాలంలో మరో సత్యాన్ని చాటి చెప్పింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఓటు ప్రాధాన్యతను నేటీ తరానికి తెలియజేసింది. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంత కీలకమైనదో తెలిపేందుకు గత జనరల్ ఎన్నికల్లోల 102 సంవత్సరాల వయసులో ఓటు వేసి ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటింది. ఉన్నతమైన భావాలు కలిగిన కాటం బాలవ్వ మరణించడంతో పలువురు ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.



కళ్యాణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

## భక్తులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదు

### జనగామ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

**కొమురవెల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవం ఈనెల 18న జరగనుండడంతో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని భక్తులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో మల్లికార్జునస్వామి కళ్యాణోత్సం సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్న పనులను పరిశీలించి మాట్లాడారు. స్వామి ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులకు నీటి, వైద్య సౌకర్యం అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. స్వామి వారి కళ్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారని ఏర్పాట్లలో ఏలాంటి లోపం ఉండొద్దన్నారు. అయన వెంట వివిధశాఖల అధికారులు, ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, అలయ చైర్మన్ గీస బిక్షపతి, జడ్పీటిసి సిద్దప్ప, డైరెక్టర్లు, నాయకులు ఉన్నారు.

## 19న ఆత్మ కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ఊడెం కృష్ణారెడ్డి

**గజ్వేల్, డిసెంబర్ 16 (ప్రభాతవార్త):** ఈనెల 19వ తేదీన ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఊడెం కృష్ణారెడ్డి, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు నాగిరెడ్డి, దేవి రవీందర్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్ల వెంకటేశం, హన్మంతరెడ్డి, కూరాకుల సాయిబాబా, లక్ష్మణ్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిస్టు అసోసియేషన్‌కు స్థలం కేటాయింపు పట్ల హర్షం



ఆర్టిస్ట్ అసోసియేషన్ నాయకులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న హరీష్‌రావు

**గజ్వేల్, డిసెంబర్ 16 (ప్రభాతవార్త):** ఆర్టిస్టు అసోసియేషన్‌ను గుర్తించి గజ్వేల్ పట్టణంలో 300 గజాల స్థలం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు రూ.25 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆర్టిస్టు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ, అధ్యక్షుడు పొట్ట యాదగిరి, ఉపాధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శులు ప్రజ్ఞాపూర్ నర్సింలు, సిహెచ్.వెంకటయ్య, కోశాధికారి నందాల శ్రీకాంత్, చిత్ర ఆర్ట్ నర్సింలులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు మంత్రి హరీష్‌రావు స్థలం, నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం కెసిఆర్‌కు, మంత్రి హరీష్‌రావుకు ఆర్టిస్ట్ అసోసియేషన్ తరపున రుణపడి ఉంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



గాలి అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

### టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్

**నర్సాపూర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గాలి అనిల్‌కుమార్‌ను శుక్రవారం ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాలి అనిల్‌కుమార్‌ను శాలూవాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన వారు మాట్లాడుతూ గాలి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. గాలి అనిల్‌కుమార్ మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి అధికారం చేపటన్టేటట్లు చేయడమే లక్ష్య మన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేషం, ఎంపిటిసీ శ్రీనివాస్‌గుప్త, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు నర్సింగరావు, సురేశ్‌నాయక్, దేవిసింగ్, ఉదయ్, మల్లేష్‌యాదవ్, రిజ్వాన్, రశీద్, అజ్మత్ పాల్గొన్నారు.

**ఆలయ నిర్మాణానికి రూ. లక్షా 11 వేలు విరాళం....**

**నర్సాపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి ఆలయం, శ్రీపోచమ్మ ఆలయాల నిర్మాణాలు చేపట్టారు. శుక్రవారం ఆలయాల నిర్మాణాలకుగాను టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ లక్ష 11 వేలరూపాయిలను విరాళంగా సర్పంచ్ శివకుమార్‌కు అందజేశారు. ఇదిలా వుండగా కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జీ గాలి అనిల్‌కుమార్‌ను టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు. కాగా ఈ పదవిని అలంకరించి మొదటిసారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేషం, ఎంపిటిసీ శ్రీనివాస్‌గుప్త, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు నర్సింగరావు, సురేశ్‌నాయక్, ఉదయ్, మన్మథరెడ్డి, రశీద్ పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ : సర్పంచ్

**కొల్చారం, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని సర్పంచి కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం కొంగోడు గ్రామంలో వడ్ల లక్ష్మికి రూ.32,000 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక సర్పంచి మంజుల సత్యనారాయణగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మంజుల సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్రె సంజీవులు తదితరులు ఉన్నారు.

## బిజెపి కార్యాలయాన్ని ప్రారంభించనున్న విజయశాంతి



మాట్లాడుతున్న పోగుల రాజు

**మెదక్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** నేడు(శనివారం) చిన్నశంకరంపేటకు మెదక్ మాజీ ఎంపీ, జాతీయ కార్యవర్గ సభ్యులు విజయశాంతి రానున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిన్నశంకరంపేటలో బిజెపి కార్యాలయాన్ని విజయశాంతి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, దశరథం, వనం నర్సింలు, భూపాల్, సయ్యద్, రాజు, శ్రీను, శ్యామ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వరి నారుమడులపై శ్రద్ధ వహించాలి : ఎవో

**నర్సాపూర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** యాసంగిలో వరి పంట సాగుచేస్తున్న రైతులు వరి నారుమడులపై ప్రత్యేక శ్రద్ధవహించాలని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ అన్నారు. రైతులు వరి నారుమడిలో విత్తనం అలికిన దగ్గర నుండి నాటు వేసేవరకు నారును కాపాడుకోవాలన్నారు. యాసంగిలో నారు ఏపుగా ఎదిగినప్పటికీ ఎరుపెక్కడం వంటివి జరుగుతుంటాయని తెలిపారు. ఈ నేసథ్యంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ అనిల్‌కుమార్ తెలిపారు. ఒక గుంట నారుమడిలో విత్తనం చల్లడానికి ముందు, విత్తనం చల్లిన 12 లేక 14 రోజుల తర్వాత కిలో యూరియా ఎరువును చల్లుకోవాలన్నారు. ముఖ్యంగా మడి దున్నడానికి ముందు పశువుల ఎరువు చల్లుకోవాలన్నారు. రాత్రి సమయంలో మంచు కురుస్తుంది కాబట్టి నారుమడి చుట్టు కర్రలు ఏర్పాటు చేసి పాలిథీన్ కవర్లుగాని బస్తాలతో తయారు చేసిన పరదాలను కప్పిఉంచడం మంచిదని చెప్పారు. జింక్ లోపం ఎదుర్కొవడానికి లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. కాగా నారు మడిలో ఎక్కువసేపు నీటిని ఉంచకూడదని అన్నారు. ఈ మేరకు నారుమడిలో ఎప్పుడికప్పుడు నీటిని మారుస్తు ఉండాలన్నారు. నారుమడిలో కలుపు యాజమాన్యం చేపడితే ఎదుగుదలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రైతులు వరినారు మడిని ఈ పద్దతిలో చేపడితే వరినారు మంచిగా ఉండి పంటల్లో అదికంగా దిగుబడి వస్తుందని ఏఓ అనిల్‌కుమార్ తెలిపారు.



యాసంగిలో వేసిన వరినారు మడి దృశ్యం

# దేశాన్ని ముంచడానికే బిఆర్‌ఎస్ : పోతరాజు రమణ

**మెదక్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ బిఆర్‌ఎస్ పేరుతో మరో మోసానికి తెరలేపారని, దేశాన్ని ముంచడానికే బిఆర్‌ఎస్‌ను పెట్టారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతరాజు రమణ అన్నారు. శుక్రవారం ఆయన చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ తెలంగాణలో అనేక సమస్యలతో ప్రజలు ఉన్నారని, అవేమి పట్టనట్లు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా బిఆర్‌ఎస్ పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి పార్టీలకు అధిష్టానం డిల్లీలో ఉంటుందని, వారు సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరని, టీఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలే అధిష్టానం అన్న కేసీఆర్ ఢిల్లీలో కూర్చొని ఇక్కడి నాయకులను అక్కడికి తరలిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రగతి భవన్‌లో మంత్రులకు, ఎమ్మెల్యేలకు కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వని ముఖ్యమంత్రి కేవలం కేసీఆర్ మాత్రమే అని అన్నారు. సామాన్య ప్రజలు వారి కష్టాలను చెప్పుకోవడానికి ఢిల్లీకి వెళ్లాలేమో అని అన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని హడావిడి గా ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తున్నారని అన్నారు. రోడ్ల మరమ్మతులకు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తున్నామని తెలుపగానే టీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు పాలాభిషేకాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో మండల కేంద్రంలోని జంగరాయి, కొండాపూర్ రోడ్ల నిర్మాణానికి నిధుల మం జూరు అనగానే బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషే కాలు చేశారని, నెలలు గడుస్తున్నప్పటికి రోడ్ల నిర్మా ణం జరగలేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం లో పాలాభిషేకాలే తప్ప, పనులు కావని ఆయన అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ది చెప్తారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు రమణ

**PUBLIC NOTICE**

The General Public hereby informed that **(1) SRI. KUKUTLA.MYSAIAH S/o. SRI PENTAIAH,** aged about 72 years, Occ. Agriculture, (2) **SMT. ANUSUYA W/o. SRI. MYSAIAH,** aged about 62 years, Occ: House Wife, Both are R/o. Ghandamala Village, Thurkapally Mandal, Nalgonda District, Telangana State., has approached the Kushaiguda Branch, Shriram City Union Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **(1) SRI. KUKUTLA. MYSAIAH & (2) SMT. ANUSUYA** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

A1l that the H.No.10-60/2, on Plot, admeasuring 112 Sq.Yds., or 93.64 Sq. mts., in forming part of Survey No.573/^B Situated at Jagdevpur Village and Mandal, Medak District, Regn. Sub-Dist: Gajwel, Regn.District: Medak at Sanga reddy, G.P.Jagadevpur, M.P.P. Jagadevpur, Z.P.P.Medak, Telangana State and bounded by: **NORTH:** Kurelly. Anjaneyulu, **SOUTH:** Plot of P.Laxmi Bai, **EAST:** Plot of P.Sataiah, **WEST:** 50' Wide Road.

**Sd/- P.SRINIVASA RAO**
Advocate
Flat No.A-14, Ground Floor,
Srinivasa Heights Apts, Uppal,
Hyderabad-39, **Cell: 9346666438.**

**PUBLIC NOTICE**

The General Public hereby informed that **SRI.SAMALA SAHADEV S/o. SRI. BIKSHAPATHI,** aged about 29 years, Occ. Business, R/o. Jagadevpur Village, Jagadevpur Mandal, Siddipet District, Telangana State., has approached the Kushai guda Branch, Shriram City Union Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **SRI. SAMALA SAHADEV** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

A1l that the Open Plot No.17, in forming part of Survey No.68/^B, admeasuring 160 Sq.Yds, or 133.78 Sq.Mts., Situated at Pragnapur Village, Gajwel Mandal, Siddipet District, Regn. Sub-Dist: Gajwel, Regn.Dist: Medak at Sangareddy, Gajwel Municipality, M.P.P.Gajwel, Z.P.P.Medak Telangana State and bounded by: **NORTH:** Plot No.16, **SOUTH:** Plot No.18, **EAST:** 30'Wide Road, **WEST:** Plot No.29.

**Sd/- P.SRINIVASA RAO**
Advocate
Flat No.A-14, Ground Floor,
Srinivasa Heights Apts, Uppal,
Hyderabad-39, **Cell: 9346666438.**


మాట్లాడుతున్న బాపు మల్‌శెట్టి తదితరులు

## రేపు మహాత్మ బోమ్‌గోండేశ్వర విగ్రహా ఆవిష్కరణ

**నారాయణఖేడ్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ఖేడ్ పట్ట ణంలో కరస్‌గుత్తి రూట్లో ఈనెల 18వ తేది ఆదివారం ఉదయం 11.30 నిముషాలకు నూతనంగా ఏర్పాటు చేయనున్న మహాత్మ బోమ్‌గోండేశ్వర విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమ మహోత్సవం నిర్వహించననున్నట్లు రాష్ట్ర నగొల్ల కుర్మ అధ్యక్షులు బాపు మల్‌శెట్టి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా బాపు మల్‌శెట్టి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బోమ్ గేండేశ్వర విగ్ర హా ప్రతిష్టాపన కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజ కవర్గంలోని గొల్లకుర్మ యాదవులు, కుల బంధువులు ప్రతి గ్రామం నుంచి గొల్లకుర్మలు డోల్‌తో బయులు దేరి గొల్ల కుర్మలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.కాగా నూతనంగా ఏర్పాటు చేయనున్న మహాత్మ బోమ్‌గోండేశ్వర విగ్రహదాత బాపు మల్‌శెట్టి తన సొంత ఖర్చులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కిష్టయ్య మాస్టర్, నరేష్‌యాదవ్, గోవింద్ యాదవ్,ఓం ప్రకాష్ యాదవ్, దూలప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారమ్మతల్లి జాతర

### పాల్గొన్న చైర్మన్ చింతాప్రభాకర్

**సదాశివపేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** మండలంలోని మద్దికుంట గ్రామంలో శుక్రవారం బంగారమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్, జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతాప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ దేవతలను పూజించడం అనేది తరతరాలుగా వస్తున్న ఆచరం దానికి అనుగుణంగా మద్దికుంట గ్రామస్తులు ముఖ్యంగా కుమ్మరి వాళ్ళు కొత్తగా ఆలయాన్ని నిర్మించుకుని జాతర చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ జాతరలో పాల్గొనడం నా అదృష్టంగా భా విస్తున్నాన్నారు. మద్దికుంట గ్రామం, ప్రజలు అందరు సుఖసంతోషాలతో ఉండా లని అమ్మవారిని వేడుకున్నారన్నారు. గ్రామ ప్రజలు ఇప్పటి వరకు నన్ను ఆదరిస్తున్నట్లు ఇక ముందు కూడా ఆదరించాలని గ్రామ ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరిఫోద్దిన్, మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు శీలమల్లన్న, సొసైటి వైస్ చైర్మన్ పాండునాయక్, కుమ్మరి చంద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు పాషామియా, మల్లన్న, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్, మార్కెట్ డైరెక్టర్ రాజు, నాయకులు వినోద్, రమేష్, అంబదాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

**కౌడిపల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** కారు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న సైకిల్ లిస్టును ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో సైకిలిస్టు తలకి తీవ్రగాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శివ ప్రసాద్ రెడ్డి, బాధితుడి భార్య కథనం ప్రకారం.. హరి చందు పంచాయతీ దేవులతండా గ్రామానికి చెందిన కాట్రోత్ విట్టల్ (55) తన సైకిల్‌పై 15వ తేదీ రాత్రి తుంకిగేట్ నుంచి దేవులతాండా గ్రామానికి వెళ్తుండగా మెదక్ నుంచి నర్సాపూర్ వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న సైకిల్ని ఢీకొట్టడంతో తలకు తీవ్రగాలై అపస్మారకస్థితిలోకి చేరుకోగా చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య చాందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో దారుణం

### - డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతో పసికందు మృతి

### - ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

**పటాన్‌చెరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వాస్పత్రిలో నార్మల్ డెలివరీలకే ప్రధాన్యతనివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచనలను వైద్యులు తూచతప్పకుండా పాటిస్తున్నారనే చెప్పవచ్చు. పురిటి నొప్పుల బాధ భరించలేక ఆపరేషన్ చేసి డెలివరీ చేయాలని కోరినా, డ్యూటీ డాక్టర్లు మాత్రం నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతనిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తోటి వైద్యులు విస్తుపోయేలా పకిందు ప్రాణాలను పొట్టన పెట్టుకునేలా డ్యూటీ చేస్తున్నారు. పురిటి నొప్పులతో ప్రభుత్వాస్పత్రికి చేరిన గర్భిణీ మహిళకు నార్మల్ డెలివరీ చేయాలనే పట్టుదలతో ఉండి పసిపాప ప్రాణాలను బలితీసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో చోటుచేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు, మహిళ కుటుంబ సభ్యులతో పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. బాధిత మహిళ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ లింగమయ్య కాలనీకి చెందిన వినోద అనే గర్భిణీ మహిళ ఈ నెల 11న ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు పురిటి నొప్పులతో ఇబ్బంది పడగా, కుటుంబ సభ్యులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. నార్మల్ డెలివరీకి ప్రయత్నించారు. పాప తల భాగం వరకు తీసి పరిస్థితి తమ అదుపులో లేదన్న విషయాన్ని పసిగట్టి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాస్పత్రికి పంపించారు. సంగారెడ్డిలో డెలివరీ చేయగా పాప పరిస్థితి విషమంగా ఉండడంతో నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అప్పటికే పసిబిడ్డ ప్రాణాలు కోల్పోయినట్లు నిలోఫర్ వైద్యులు చెప్పారన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే పాప ప్రానం కోల్పోయిందని బాధిత మహిళ, కుటుం సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటన జరిగిన ఐదారు రోజులకు వెలుగులోకి రావడంతో బిజెపి నాయకులు బాధిత కుటుంబ సభ్యులతో పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఈ సందర్బంగా బిజెపి సీనియర్ నాయకులు సి గోదావరిఅంజిరెడ్డి, గడీల శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ ఎడ్ల రమేష్ లు మాట్లాడుతూ అన్యాయాలకు, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి మారిందని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యహరించిన డ్యూటీ డాక్టర్, సూపరింటెండెంట్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

## మృతుడి కుంటుంబానికి పలువురి పరామర్శ

**దుబ్బాక, డిసెంబర్ 16, ప్రభాత వార్త:** దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట గ్రామానికి చెందిన దుబ్బాక నియోజకవర్గ జర్నలిస్టు టివి9 యాదగిరి కుమారుడు సాయి కుమార్ గురువారం హైదరాబాద్‌లో మృతి చెందడం జరిగింది. శుక్రవారం మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకు రావడంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి రజినికాంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకటనర్సింహరెడ్డి, దుబ్బాక ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చెక్కపల్లి రాజమల్లు, గుండెల్లి లక్ష్మారెడ్డి, పలువురు జర్నలిస్టులు మృతునికి నివాళ్ళు అర్పించి యాదగిరిని పరామర్శించారు. అంత్యక్రియల నిమ్మితం కోటిరెడ్డి రజిని కాంత్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.

### వన్‌ఫర్ అవర్ ప్లానెట్ ప్రారంభించిన పెర్నార్డ్ రికార్డ్ ఇండియా

వైన్ మరియు స్పిరిట్స్ పరిశ్రమలో అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన పెర్నార్డ్ రికార్డ్ ఇండియా పరిశ్రమలో మొట్టమొదటి సారిగా ఒన్‌ఫర్ అవర్ ప్లానెట్ కార్యక్రమం ప్రారంభించింది. తమ ప్యాకేజింగ్ నుంచి శాశ్వతంగా మోనో కార్డన్స్‌ను తొలగించాలనే ప్రయత్నానికి ఇది కొనసా గింపు. ఈ ల్యాండ్‌మార్క్ సస్టైనబిలిటీ కార్యక్రమంతో ఈ కంపెనీ 100 శాతం శాశ్వతంగా మోనో కార్టన్స్‌ను తమ ప్యాకేజింగ్ నుంచి నుంచి జూన్ 2023 నాటి దశల వారీగా తొలగించడం లక్ష్యంగా చేసుకుంది. ఒన్‌ఫర్ ఆర్ ప్లానెట్ కార్యక్రమం.

# కాసాల ప్రభుత్వ భూముల్లో పెద్దల పాగ

## అసైన్డ్ భూముల్లో ప్రభుత్వ ఉద్యోగులు, నాయకుల కుటుంబ సభ్యులు


కాసాల గ్రామంలో పరాధీనంమైన ప్రభుత్వ భూమి

**హత్నూర డిసెంబరు 16,ప్రభాతవార్త:** కాసాల రెవెన్యూ గ్రామం పరిదిలోని ప్రభుత్వ భూములలో, ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్దిదారులకు ప్రస్తుతం లబ్దిదారులకు చాల వ్యత్యాసాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం భూములు కెటాయించిన లబ్దిదారుల నుండి వారి అవసరాలను అసరగా చేసుకొని తమ సోంతం చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కెటాయించిన లబ్ధిదారుల నుండి కొందరు లబ్దిదారులతో బేరాసారాలు నడిపి వారికి కెటాయించిన భూములను కొనుగోలు చేసి ప్రస్తుతం ప్రభుత్వ భూములలో పాగవేశారని స్థానికుల తెలిపారు. లబ్దిదారులు ఉండాల్సి ప్రభుత ్వ భూములలో ప్రైవేటు వ్యక్తులు, బాడా భూస్వాములు,పప్రభుత్వ ఉద్యోగుల కుటుంభ సభ్యులు, నాయకులు కుటంభ సభ్యులు పాగవేశారని స్థానికులు తెలిపారు. 336 సర్వేనెంబర్‌లో కాసా ప్రకారం ఉండాల్సి రగ్బా, ప్రస్తుత పహణి రికార్డుల ప్రకారం పరిశీలిస్తే ఉండాల్సి రగ్బా కన్నా అధికంగా రగ్బా పెరిగిందని స్థానికులు తెలిపారు. ఇలా పెరగడానికి అప్పటి కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యంమే కారణమని గ్రామస్థలు ఆరోపిస్తున్నారు. అసైన్‌మెంట్ కాని వారికి కూడ కొందరు అధికారులు భూముల రికార్డులలో చేర్చడంతో వ్యవత్యాసాలకు అస్కారం ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ భూములలో అసైన్‌మెంట్ కమీటి సూచనలు మేరకు లేదా ఉన్నతాదికారుల అదేశాలతోనే భూములలో లబ్దిదారుల భూమలు కెటాయించడం, పేర్లు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. కాని స్థానికంగా విధులు నిర్వహించిన కొందరు అధికారులు కాసులకు కక్కుర్తి పడి వారి ఇష్టారితిగా వ్యవరించడంతో పహణిలో అసలైన లబిదారులకు, ఇబ్బందులు ఎదురవుతూన్నాయని వారు ఆరోపిస్తున్నారు. అసైన్‌మెంట్ కమీటి ద్వారా ప్రభుత్వ నుండి వ్యవసాయ భూములు పోందిన రైతులు, అట్టి భూమీలో సాగుచేయడం ఇష్టంలేకపోయినా, అట్టి భూమీ వద్దుఅనుకొని నిర్ణయించుకున్న సమయంలో అలబ్దిదారులు అవసరలేని భూమి విషాయలు పొంధు పరిచి సంబందిత తహసిల్దార్‌కు రాజీనామ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఆభూమీని సంబందిత అధికారులు స్వాధీనం చేసుకొని అర్హులైన అర్హులైన మరోలబ్దిదారులకు కమీటి నిర్ణయం మేరకు కెటాయించాల్సి ఉంటుందని అధికారుల పెర్కోంటున్నారు. కాసాల గ్రామం హెచ్‌ఎండి పరిధిలోకి రావడంతో అసైన్‌మెంట్ కమీటి ద్వారా ప్రభుత్వ భూములు కెటాయించే అవకాశం లేకుండా పోయింది. ఏవిధంగా చూసినా, ప్రభుత్వ భూమీని ప్రభుత్వం ద్వారా లబ్దిదారులకు కెటాయింపులు జరిగే అవకాశం లేకపోవడంతో, ప్రభుత్వ భూములలో పాగవేయాలని నిర్ణయించిన కొందరు అక్రమార్కులు తాము ఎంచుకున్న మార్గలలో ముందుకు పోయి విలువైన ప్రభుత్వ భూములను తమ వశం చేసుకున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. అక్రమార్గం ఎంచుకున్న వారికి అప్పటి కొందరు అధికారుల సహయ సహకారాలు కూడ వారికి లభించాయని ఆరోపించారు. పేదోడు ఒక గుంట ప్రభుత్వ భూమీ సాగుచేసుకుంటే రంగంలోనికి దిగే అదికారులు ఎకరాల కొద్ది ప్రభుత్వ భూములు అక్రమణకు గురైన పట్టించుకోక పోవడం సంబందిత అధికారుల చిత్తశుద్దిని తెలియజేస్తుందని వారు ఆరోపిస్తున్నారు. సంబందిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంవల్లనే ప్రభుత్వ భూమీ ఇతరులకు చేరిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. లబ్దిదారుల అవసరాసలను, అమయకత్వాన్ని అసరాగా చేసుకొని లబ్దిదారులకు ఎంతో కొంత ముట్టజెప్పి వారి నుండి భూమీని స్వాదీనంలోకి తీసుకోని అనుభవిస్తున్న వారి విషయం, స్థానికంగా బహిరంగ రహస్యం అయినా, అధికారుల పట్టించుకొవడంలేదని వారు ఆరోపిస్తున్నారు.


రూరల్ సిఐని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధుల దృశ్యం

## రూరల్ సిఐని సన్మానించిన ప్రజాప్రతినిధులు

**న్యాల్‌కల్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ రూరల్ సిఐ నోముల వెంకటేశ్‌ను శుక్రవారం మండలంలోని హద్నూర్ గ్రామంలోని సిఐ కార్యాలయంలో కలిసి సన్మానించారు. సిఐ కార్యాలయానికి హద్నూర్ గ్రామ ఉప సర్పంచ్, మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు షబ్బీర్‌ఖాన్, హద్నూర్ ఎంపిటిసి సభ్యులు మహ్మద్ సలీంలు చేరుకుని సిఐకి అభినందనలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల కొరకు తమ వంతు సహకరిస్తామని సిఐకి హామి చేసినట్లు షబ్బీర్ ఖాన్ వివరించారు.

## సిఎం కేసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు


ముఖ్యమంత్రి కేసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఢిల్లీలోని సిఎం నివాసంలో జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధిపై సిఎం ఆరా తీసినట్లు ఎమ్మెల్యే మాణిక్‌రావు వివరించారు. నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులపై సిఎం ఆరా తీశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారని ఎమ్మెల్యే వివరించారు.

## సభ దృష్టికి గ్రామాల్లోని సమస్యలు


మండల సర్వసభ్య సమావేశం కొనసాగుతున్న దృశ్యం

**జహీరాబాద్ (కోహీర్), డిసెంబరు 16, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు మండల సభలో వివరించారు. శుక్రవారం ఎంపిపి అధ్యక్షులు బి మాధవి అధ్యక్షతన మండల సాధారాణ సర్వ సభ్య సమావేశం కొనసాగింది. ఆయా గ్రామాల్లో కరెంటు సమస్యలు వేదిస్తున్నాయని ప్రజాప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, ప్రయాణించేందుకు ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తోందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నట్లు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వాపోయారు. ఉపాధి హామి పనులను ప్రతి ఒక్క కూలికి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, జిల్లా అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళతామని ఎంపిడిఓ సుజాత నాయక్ సభలో వివరించారు. కార్యక్రమంలో ఎంపిఓ వెకంట్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు రాందాస్, ఎంపిపి ఉపాధ్యక్షులు శాకీర్ అలీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## ఎడ్ల బండీని ఢీకొన్న లారీ : మూడు ఎడ్లు మృతి

**అల్లాదుర్గం, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** బతుకు దెరువు కోసం వలన వెళ్తున్న గిరిజన కుటుంబానికి రోడ్డు ప్రమాదం ఉపాధి దూరం చేసింది. ఉపాధి కోసం తన కుటుంబంతో సహ చెరుకు బండిపై మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం కోమటి కుంట గిరిజన తాండకు చెందిన దెగావత్ సంగ్యా నాయక్ సంగారెడ్డి వైపు వస్తుండగా శివ్వంపేట బ్రిడ్జీపై ఉదయం 5 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన లారీ వెనుక నుండి ఎడ్లబండిని ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మూడు ఎడ్లు మృ త్యువాత పడ్డాయి. ఎడ్ల బండిలో ఉన్న సంగ్యానాయక్ తోపాటు కుటుంబ సభ్యులు తీవ్రగాయాలయ్యాయి. వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా లారీ ఢీకొన్న సంఘటనలో మూడు ఎడ్లు మృతిచెందడంతో తాను ఆర్థికంగ ఎంతో నష్టపోయాయని బాధితకుటుంబీకులు కన్నీరు కారుస్తూ తెలిపారు. తమ కుటుంబానికి ఉపాధి చూపించే ఎడ్లు ఈ ప్రమాధంలో మృతిచెందడం వలన తాము ఆర్థికంగా చాలా నష్టపోయామని ప్రభుత్వం తమకు నష్టపరిహారం ఇప్పించి, తామకుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.


స్వచ్ఛబడిని పరిశీలిస్తున్న దృశ్యం

## స్వచ్ఛ బడిని సందర్శించిన మేయర్

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని స్వచ్ఛబడిని ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్‌కు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కమిషన్ స్వాగతం పలికి స్వచ్ఛబడిలోని పరిసరాలను చెత్త నుంచి ఎరువును తయారు చేసే విధానాన్ని వివరించారు. సిద్దిపేటలో చెత్తను ప్రజలు మూడు రకాలుగా వేరు చేసి ఇచ్చే విధానాన్ని వారికి క్షుణంగా వివరించారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు సహకారంతో సిద్దిపేట మున్సిపాలిటీని అద్భుతంగా తీర్చిదిద్దుకోవడం జరిగిందని తెలిపారు. సిద్దిపేట స్వచ్ఛ బడి పనితీరు చూసిన మేయర్ ముగ్దులయ్యారు. అనంతరం స్వచ్ఛ బడిని సందర్శించిన బృందానికి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు స్వచ్ఛ సిద్దిపేట గోడ గడియారాలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దీప్తినాగరాజు, కలకుంట మల్లికార్జున్, వడ్లకొండ సాయి, కమీషన్ తదితరులు ఉన్నారు.

## ఎస్ఐని సన్మానించిన బిజెవైఎం నాయకులు

**నాగల్‌గిద్ద, డిసెంబరు 16, ప్రభాతవార్త:** పోలీసు ఠాణాకు ఎస్ఐగా ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్ఐ దశరత్‌ను శుక్రవారం బీజెవైఎం నాయకులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో ఎస్ఐని నాయకులు ఘనంగా సత్కరించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం ఉంటుందని నాయకులు ఎస్ఐకి వివరించారు. కార్యక్రమంలో బిజెవైఎం మండల ఉపాధ్యక్షులు హనుమంతు, ప్రధాన కార్యదర్శి బిందాస్, యువ మోర్చా జిల్లా నాయకులు రాజుస్వామి తదితరులు ఉన్నారు.

## తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా సత్తయ్యయాదవ్

**సదాశివపేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా సదాశివపేటకు చెందిన కొత్తగొల్ల సత్తయ్యయాదవ్‌ని నియమిస్తున్న హైద్రాబాద్ తర్నాకలోని కేంద్ర కార్యాలయంలో టిజెఎసి రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సకల జనుల శ్రేయస్సు కోసం పాటు పడుతూ స్వచ్ఛందంగా ఎన్నో సామాజిక ఉద్యమాలలో పాల్గొంటూ ప్రజాధరణ పొందిన నాయకునిగా పేరు తెచ్చుకున్నా కొత్తకొల్ల సత్తయ్యయాదవ్‌ని సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా నియమిస్తున్నామన్నారు. టిజెఏసి సిద్దాంతాలకు అనుగుణంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉండి పని చేయాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి అధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార సాధనకు పాటు పడాలని సత్తయ్యయాదవ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టిజెఏసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహాశీల్దార్ కార్యాలయానికి రేషన్ డీలర్ల సంఘం కుర్చీల వితరణ

**అక్బర్‌పేటభూంపల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** అక్బర్‌పేటభూంపల్లి మండల నూతన తహాశీల్దార్ కార్యాలయానికి వస్తున్న ప్రజలకు కూర్చోవడానికి కుర్చీలు లేక పోవడంతో ఇట్టి విషయాన్ని గమనించిన నూతన మండల డీలర్ల సంఘం సభ్యులు కార్యాలయానికి వచ్చిన ప్రజలు కూర్చోవడానికి 10 కుర్చీలను తహాశీల్దార్ విరేశంకు శుక్రవారం అందించారు. అనంతరం కార్యాలయంలో రేషన్ డీలర్లతో తహాశీల్దార్ విరేషం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపులో నెలలో పంపిణీ చేయబడిన సరుకుల వివరాల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ షాపులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. రేషన్ షాపులో ఏదైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. రేషన్ షాపుకు వచ్చె ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా మెదులుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జూలూరి నాగభూషణం, అధ్యక్షుడు ఆరుట్ల నారయాణ రెడ్డి, కోశాధికారి ముక్క శ్రీనివాస్, కార్యదర్శి బోర్మిండ్ల మల్లేశం, సలహాదారులు ఏ. రాజయ్య, ఈ. స్వామి, ఆర్ రామస్వామి, బి.నర్సింలు, కే. కుమార్, లక్ష్మీనర్సింలు, దానయ్య, సుధాకర్, శ్రీను, రాజయ్య, నరేంధర్, తదితరులు పాల్గొన్నారు.


తహాశీల్దార్ కార్యాలయానికి కుర్చిలను అందిస్తున్న దృశ్యం


శనగ విత్తనాలకు విత్తున శుద్ధి చేయిస్తున్న ఏఓ లావణ్య

## విత్తన శుద్ధితో అధిక దిగుబడి తథ్యం

### -మండల వ్యవసాయ అధికారి లావణ్య

**న్యాల్‌కల్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్దతులు పాటించడంతో పాటు పంటను విత్తే ముందు విధిగా విత్తనాలకు విత్తన శుద్ధి చేసుకుని విత్తుకోవాల్సిన అవసరం ఉంటుందని మండల వ్యవసాయ అధికారిణి ఎన్ లావణ్య రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో రైతు హోతి అంజన్న తను సాగు చేసుకుంటున్న శనగ పంటకు అధికారిణి లావణ్య దగ్గరుండి శనగ విత్తనాలకు ట్రైకోడర్మా విరిడితో విత్తన శుద్ధి చేయించారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ ట్రైకోడర్మా విరిడి రైతులకు అందుబాటులో తక్కువ ధరకే లభ్యమవుతుందని, అందుకు రైతులు పంటలను సాగు చేసుకునే ముందర విత్తనాలకు ట్రైకోడర్మా విరడిని కలుపుకుని పంటను సాగు చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధితో పంటకు తెగుళ్లు సోకే అవకాశాలు తక్కువగా ఉంటాయని, పంట ఎదుగుదలలో తెగులు సోకితే నీటితో మందును కలుపుకుని పంటల మొదళ్లలో పిచకారి చేసుకోవాలన్నారు. ఎండు తెగులు, మొక్కలు వండి పడిపోవడం లాంటి సమస్యలు ఉండవని, ఫలితంగా పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఇఓ ఈనా, రైతులు పెద్దొడ్డి శివరాజ్, హోతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మను దర్శించుకున్న ఆర్టీసి డిపో మేనేజర్


నల్లపోచమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఆర్టీసి డిపో మేనేజర్

**మనూర్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** మండలంలోని బోరంగ గ్రామంలో భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీ నల్లపోచమ్మ తల్లి ఆలయాన్ని శుక్రవారం నారాయణఖేడ్ ఆర్‌టిసి డిపో మేనేజర్ మల్లేషయ్య తన సిబ్బందితో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న డిపో మేనేజర్‌ను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు శ్రీకాంత్ స్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా మేనేజర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మేనేజర్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆర్టీసి ఉద్యోగులు, ప్రయాణీకులు సుఖ సంతోషాలతో ఉండాలని, ఆర్టీసి లాభాల బాటలో పయనించేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు డిపో మేనేజర్ వివరించారు. ఇదిలా ఉండగా గంగారబోయిని హర్షవర్ధన్ తడుపల్ అమ్మవారికి వెండి పాదాలను బహుకరించగా అర్చకులు అమ్మవారికి వెండి పాదాలను అలంకరించారు. డిపో మార్కెటింగ్ అధికారి పాండు, కార్గో ఇంచార్జి సంతోష్ బాలరాజ్, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రికి గ్రామోదయ పుస్తకం బహూకరణ

### -సామాజిక ఉద్యమ కారులు ఢిల్లీ వసంత్

**జహీరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు న్యూ ఢిల్లీలో సామాజిక ఉద్యమ కారులు ఢిల్లీ వసంత్ గ్రామోదయ పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఢిల్లీ వసంత్ మాట్లాడుతూనవ భారత నిర్మాణం కోరకు నడుం బిగించిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రయత్నాలకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తున్నదన్నారు. బిఆర్ఎస్ పార్టీ విధానపరమైనవిధి విధానాలకై గ్రామోదయ సిద్ధాంతానికి ఉన్న ఆవశ్యకతను గుర్తు చేస్తూ గ్రామోదయా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ (జిసిఓటి) ఆధ్వర్యంలో చేపట్టిన పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందచేసినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల పూర్వ విద్యార్థుల ఆధ్వరనంయలో జిసిఓటిని స్థాపించినట్లు గుర్తు చేశారు.

## ఆస్తికోసం దారుణ హత్య

### - కల్లులో నిద్ర మాత్రలు కలిపి, రోకలితో తలపై బాది హత్య

### - మొదటి భార్య కొడుకే హంతకుడు

### - 5 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

**రామయంపేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** ఆస్తికోసం భర్త మొదటి భార్య కొడుకు ఓ మహిళను దారుణంగా హత్య చేశాడు. రామయంపేట సిఐ చంద్రశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన నోములు మంజుల (50) అనే మహిళ భర్త గత కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మంజుల గ్రామంలోని ఒంటరిగా ఉంటుంది. మృతురాలు భర్త మొదటి భార్య కొడుకు అయిన రవి తన తండ్రి పేరు మీద ఉన్న ఆస్తి కోసం మంజులను హత్యమార్చడానికి నిర్ణయించుకున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో కల్లులో నిద్రమాత్రలు కలపి మంజులకు తాగించాడు. ఆమె నిద్రలోకి జారుకున్నాక ఇంట్లోని రోకలి బండతో తలపై అతి కిరాతకంగా బాధి హత్య చేశాడు. తర్వాత ఆమె మేడాలో రెండు తులాల బంగారం పుస్తెలతాడు, అర్థతులం చెవి కమ్మలు, 40 తులాల వెండీ కడియాలు ఎత్తుకెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపి, ఐదు గంటల్లో నేరస్థున్ని పట్టుకున్నారు. ఆస్తికోసం తన భార్యత మానసతో కలిసి మంజులను హత్య చేసినట్టు రవి ఒప్పుకున్నట్లు సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఐదు గంటల్లో కేసు చేధించిన తుప్రాన్ డిఎస్పీ యాదగిరిరెడ్డి, రామయంపేట ఎస్ఐ రాజేష్, తూప్రాన్, నర్సాపూర్ సీఐలను, నిజాంపేట్, శంకరంపేట్, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అభినందించారు.

## క్యాట్ పరీక్ష కష్టమేమి కాదు

### విద్యార్థులకు టైమ్ నిపుణుడు రామ్‌నాథ్ ఉద్బాటన

**పటాన్‌చెరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** ప్రణాళికబద్ధంగా సన్నద్ధమైతే, ప్రతిష్టాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) లలో ప్రవేశం పొందడానికి నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (క్యాట్) పరీక్షలో నెగ్గడం పెద్ద కష్టమేమీ కాదని ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి, టైమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రామ్‌నాథ్ స్పష్టీకరించారు. గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో క్యాట్, జీమ్యాట్ ద్వారా కెరీర్ అవకా శాలు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. టైమ్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో గీతం కెరీర్ గైడెన్స సెంటర్ (జీసీజీసీ) ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ క్యాట్‌కు పోటీ అధికమని, దాదాపు మూడువేల సీట్లకు రెండున్నర లక్షల మంది పోటీపడతారని చెప్పారు.

### ఫైనాన్స్‌పీర్ అండ్ హాల్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం

భారతదేశంలోని ప్రముఖ ఫీజు చెల్లింపు పరిష్కార సంస్థ ఫైనాన్స్‌పీర్ గ్లోబల్ టెక్‌ఎనేబుల్డ్ ఇంటర్నేషనల్ కాలేజ్ అడ్మిషన్స్ కోచింగ్ ప్లాట్ఫామ్ అయిన హాల్స్ కలసి విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఎండ్–టు ఎండ్ సహాయం అందించడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ సందర్భంగా హాల్స్ సహవ్యవస్థాపకుడు అండ్ సీఈఓ మా థ్యూ మెక్‌బెల్లస్ మాట్లాడుతూ యునైటెడ్‌కింగ్ డమ్ అమెరికా కెనడా ఆస్ట్రేలియా వంటి దేశాలు తమ ప్రపంచ స్థాయి ఫ్యాకల్టీ సమగ్ర కార్యక్రమాలు పోస్ట్ స్టడీ పని వాతావరణాలు గొప్ప జీవన ప్రమాణాలు కారణంగా విదేశీ విద్య గమ్యస్థానాలకు ప్రసిద్ధి చెందాయన్నారు.